పనులు ప్రారంభం అయ్యేనా?

సీసీబీ నిర్మాణానికి పూర్తయిన టెండర్ల ప్రక్రియ

- ఒక్కో సీసీబీకి రూ.23.75కోట్లు
- బాదేపల్లిలో అందుబాటులో లేని స్థలం
- నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూలులో కొనసాగుతున్న పనులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లిలో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ) నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రధానమంత్రి ఆయుష్మాన్‌భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ మిషన్‌లో భాగంగా బాదేపల్లికి సీసీబీ మంజూరయ్యింది. గత ఏడాది అక్టోబర్ 3న నిజామాబాద్‌లో జరిగిన సభలో రాష్ట్రానికి మంజూరైన 20 సీసీబీ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. వాటిలో ఉమ్మడి జిల్లాకు బాదేపల్లి, నారాయణపేట, గద్వాల, నాగర్‌కర్నూలు కేంద్రాలున్నాయి. ఒక్కో సీసీబీకి రూ.23.75 కోట్లు అంటే మొత్తం రూ.90కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాస్తవానికి సీసీబీ నిర్మాణం కోసం జనవరిలోనే టెండరు ప్రక్రియ ప్రారంభమైనా ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కాస్త ఆలస్యం అయ్యింది. మేలో ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత తతంగం పూర్తిచేశారు.

అయోమయంలో అధికారులు

సీసీబీని ఎక్కడ నిర్మించాలనే విషయంలో వివాదం ఏర్పడింది. ఇదే జాప్యానికి దారితీసింది. ప్రస్తుత ఏరియా ఆస్పత్రి వద్ద నిర్మించాలని తలపెట్టినప్పటికీ ఆస్పత్రి పాతభవనం అనుకూలంగా ఉంటుందనే అభిప్రాయాలు వెలువడటంతో అధికారులు అయోమయంలో పడ్డారు. పాతభవనం వద్ద నిర్మాణం జరిపితే వాహనాల రాకపోకలకు సౌకర్యంగా లేకపోవటంతో స్థల విషయంలో అధికారులు నిర్ణయానికి రాకపోతున్నారు. కొత్త భవనం వద్ద స్థలాభావ సమస్య ఏర్పడుతుంది. వాస్తవానికి సీసీబీ నిర్మాణానికి మూడెకరాల స్థలం అవసరం. బాదేపల్లి పరిసరాల్లో అంత ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. దీంతోపాటు సీసీబీ జాతీయ రహదారి పక్కనే ఉండాలనే నిబంధన ఉంది. ఇతర ప్రాంతాల్లో నిర్మించే వీలు లేకుండా పోయింది.



ఏరియా ఆస్పత్రి వద్ద టవర్ నిర్మించాలనుకుంటున్న స్థలం..



జడ్చర్ల ఏరియా ఆస్పత్రి భవనం

మెరుగైన సేవలందే అవకాశం

ప్రస్తుత భవనం వద్ద మార్చురీకి అనుకుని రెండు ఫ్లోర్ల టవర్ నిర్మించి ప్రస్తుత భవనంపై మరో రెండు ఫ్లోర్లు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆస్పత్రి వద్ద నిర్మాణం జరిపితేనే ప్రయోజనాలు కలుగుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏరియా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సీసీబీలో సేవలందించే అవకాశం ఉంది. ఇక్కడ ఉండే ఎమర్జెన్సీ డాక్టర్లు, సిబ్బంది ఏరియా ఆస్పత్రిలోనూ సేవలు అందించేందుకు వీలవుతుంది. ఇరువురి సమన్వయంతో రోగులకు మెరుగైన సేవలు అందించటానికి అవకాశాలున్నాయి.

తగ్గనున్న రెఫరల్

ప్రస్తుత ఆస్పత్రి పేరుకే వంద పడకల ఆస్పత్రి. సిబ్బంది, డాక్టర్లు అంతా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయిలోనే ఉన్నారు. దీంతో అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చేవారిని జిల్లా ఆస్పత్రికి రెఫరల్ చేస్తున్నారు. సీసీబీ ప్రారంభమైతే రెఫరల్ సమస్య తగ్గుతుంది. జడ్చర్ల మీదుగా 44, 167వ నంబరు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతుంటాయి. ఇలాంటి సమయంలో అత్యవసర సేవలు అందక ప్రాణాలు కోల్పోతున్నారు. గుండెపోటు, పక్షవాతం, పాము కాటు, క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడేవారికి రాత్రిళ్లు అత్యవసర సేవలు అవసరం అవుతాయి. సీసీబీలో నిష్ణాతులైన వైద్యులు 24గంటలు అందుబాటులో ఉండటంతో ప్రైవేటుకి సత్వర చికిత్స అందించే వీలవుతుంది. సీసీబీని ప్రస్తుత ఆస్పత్రి వద్ద నిర్మించటమే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

> **త్వరలోనే పనులు**
>
> ఆయుష్మాన్ భారత్ మిషన్‌లో భాగంగా మంజూరైన క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఒక్క బాదేపల్లి మాత్రమే స్థల ఎంపిక కారణంగా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుత ఆస్పత్రి నూతన భవనంవద్ద నిర్మాణం చేయాలా... పాతభవనం వద్ద నిర్మించాల అన్న సందేహం నెలకొంది. మరో వారంలో స్థానిక ఎమ్మెల్యేను కలసి స్థలం ఎంపిక చేసి నిర్మాణం ప్రారంభిస్తాం.
>
> –జైపాల్‌రెడ్డి, ఈఈ, స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

అమిస్తాపూర్‌లో అయ్యప్ప జపం

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామం సోమవారం అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో పడిపూజ నిర్వహించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన రఘుపతిశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో అమిస్తాపూర్‌కు చెందిన 28మంది అయ్యప్ప మాలధారులు మహాపడి పూజ చేశారు. అయ్యప్పకు అభిషేకం, 18 పడి మెట్లకు పూజను నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు వందలాది తరలివచ్చారు. అన్నదానం కార్యక్రమం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అమిస్తాపూర్‌లో అభిషేకం చేస్తున్న మాలధారులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కొత్త చెరువు రోడ్డులో సోమవారం కోట్ల విజయ్‌కుమార్ యాదవ్ స్వామి భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అ య్య ప్ప భక్తిగీతాలతో ఆప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పడిపూజలో అయ్యప్ప మాలధారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో..

క్లుప్తంగా

సైడ్‌జాలీలు ఏర్పాటు చేయాలి



జడ్చర్ల టౌన్: ప్రైవేట్ స్కూల్ బస్సులకు సైడ్ జాలీలు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య అన్నారు. సోమవారం ఎంఈఓ మంజులాదేవికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కిటికీలనుంచి తొంగిచూడకుండా జాలీలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక బస్సులు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాయని, అలాంటివాటిపై చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. నాయకులు రఘు, మహేష్, జంగయ్య పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవాబుపేట: డెంగ్యూ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యసిబ్బంది శరభలింగం, రాఘవేందర్ సూచించారు. సోమవారం మండలంలోని లోకిరేవు గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు కావటంతో వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలపై అవగాహన కల్పించారు. బాధితుల ఇళ్లను పరిశీలించి పరిసరాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సంతోష, నాగమణి, పద్మావతి ఉన్నారు.

కేంద్రానికి నివేదిక పంపుతాం



హన్వాడ: ఇటీవల రాగి పంట సాగు తగ్గదలపై సేకరించిన వివరాల నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని వ్యవసాయ శాస్త్రవేత్త డా.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట, టంకర గ్రామాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. రైతుల నుంచి వివరాలను సేకరించారు. రాగి సాగు తగ్గుదలకు గల కారణాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, ఏఈఓ గోవిందు, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం



మిడ్జిల్: రాష్ట్రస్థాయిలో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ టీంకు ఎంపికైన విద్యార్థినులను సోమవారం సన్మానించారు. మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాలకు చెందిన స్వప్ని, అనిత, మాధవి, అర్పిత అనే విద్యార్థినిలు హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు ఆపాఠశాల హెచ్ఎం వెంకటయ్య తెలిపారు. ఎంఈఓ సుధాకర్, పీఈటీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజలే తరమికొడతారు’



రాజాపూర్: రాష్ట్రంలోని అసమర్థ ప్రభుత్వాన్ని ప్రజలే తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేకల శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజనులను హింసలను గురిచేసి వారి భూములను లాక్కోవడమే ఇందిరమ్మ రాజ్యమా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం లగచర్లలో రైతుల భూములను లాక్కోని బడాబాబులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేస్తే ఎక్కడ ఇలాంటి ఘటనలు చేసుకోలేదన్నారు. మాజీ జెడ్పీటీసీ మోహన్‌నాయక్, ఎంపీపీ సుశీలరమేష్‌నాయక్‌ను అక్రమంగా అరెస్ట్‌చేశారని, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కప్పెరిబచ్చిరెడ్డి, నాయకులు ఆనంద్‌గౌడ్, సత్యయ్య, వెంకటేష్, విజయ్, నర్సింలు, యాదగిరి, తిరుపతయ్య ఉన్నారు.

మొదంపల్లిలో దుండగుల దుశ్చర్య

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలం మొదంపల్లి గ్రామంలో ఇద్దరు దుండగులు ఓ వర్గానికి చెందిన విగ్రహాన్ని పెకిలించి అపవిత్రం చేశారు. ఈవిషయాన్ని గ్రామస్తులు ఆదివారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మొదంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ ఖలీల్, పిట్టలలింగం శనివారం రాత్రి గ్రామంలోని విగ్రహాన్ని పెకిలించారు. ఆదివారం గ్రామస్తులు అక్కడ వెళ్లి చూడగా విగ్రహం పెకిలించి ఉంది. ఈదుశ్చర్యకు ఖలీల్, పిట్టలలింగం పాల్పడినట్లు గుర్తించారు. మద్యం మత్తులో పిట్టలలింగం ఈ పనులు చేయగా ఖలీల్ సెల్‌ఫోన్‌లో రికార్డుచేసి వైరల్ చేశారు. గ్రామస్తులు ఈవిషయంపై రాజాపూర్ పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

శివాలయంలో చైర్మన్ పూజలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం అంబేద్కర్‌నగర్ (42వవార్డు)లోని శివాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వన భోజనాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ రామ్‌లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, పాపారాయుడు, కాలనీవాసులు రమేష్, మహేశ్వర్‌రెడ్డి, ముత్యాల లక్ష్మణ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర ఆలయంలో రుద్రహోమం



అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని గుట్టపై నిర్మించిన శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం రుద్రహోమం నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో ఆలయ పండితులు ప్రత్యేక పూజలు చేసి హోమం జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా లక్ష్మారెడ్డి

భూత్పూర్: మున్సిపల్ కమిషనర్‌గా లక్ష్మారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కమిషనర్‌గా పనిచేసిన సురేందర్‌రెడ్డి హైదరాబాద్ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లారు. ఆ స్థానం ఖాళీ ఏర్పడటంతో కమిషనర్‌గా లక్ష్మారెడ్డిని నియమించారు. చైర్మన్ బస్వరాజ్‌గౌడ్‌ను మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పైపులను తీశారు.. వదిలేశారు

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి పక్కన అండర్ డ్రెయినేజీ పైపులను తీశారు.. అలాగే వదిలేశారు. దీంతో భరించలేని దుర్వాసన వస్తోంది. అటుగా వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అక్కడ ఏర్పడిన గుంతలో ఆరునెలల క్రితం రెండేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి గుంతలోపడి మృతిచెందాడు. ఈఘటనపై అప్పట్లో హడావుడి చేసిన నాయకులు, అధికారులు ఇప్పటి వరకు అటువైపు తిరిగి కూడా చూడలేదు. మరో ప్రమాదం జరగకముందే అండర్ డ్రైనేజీ పైపులు వేసి మురుగు దుర్వాసన నుంచి విముక్తి కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రోడ్డులో వదిలేసిన అండర్ డ్రెయినేజీ పైపులు

పశుగణన ప్రక్రియ ప్రారంభం

మిడ్జిల్: మండలంలో సోమవారం నుంచి 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పశువైద్యాధికారి శివరాజ్ తెలిపారు. మండలంలో 7మంది ఎన్యుమరేటర్లు నేటినుంచి ఫిబ్రవరి 25వరకు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పశుగణన చేస్తారన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజలు తమవద్ద ఉన్న వివరాలను ఎన్యుమరేటర్లకు తెలపాలని కోరారు.



కొత్తపల్లిలో కొనసాగుతున్న పశుగణన

రోడ్డుకు మరమ్మతు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీ నెంబర్ వన్ రోడ్డుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. జిల్లా మైనార్టీ కో–ఆర్డినేటర్ నయీమ్‌ఖాన్‌తో కలిసి కాలనీవాసులు రోడ్డు పాడైన విషయాన్ని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన 24గంటల్లోనే రోడ్డుకు మట్టి వేయించి మరమ్మతులు చేయించారు. కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గం సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పరమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విల్సన్, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా బెక్కెం జనార్ధన్, కార్యదర్శిగా మణ్యం, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రావు, సజ్జద్ హమీద్, మరికొందరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవాబుపేట: మండలంలోని అమ్మపూర్, రుద్రారం ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ తెలిపారు. తరచూ లైన్ల మధ్య ఇబ్బందులు రావటంతో వాటిని మరమ్మతులు చేసేందుకు రెండో రోజు కూడా కోతలు విధిస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రంగస్థల నాటక కమిటీ ఎన్నిక

కోయిల్‌కొండ: తెలంగాణ నాటక సమాఖ్య మండలస్థాయి రంగస్థల నాటక మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రయ్య, ప్రధానకార్యదర్శిగా కుమ్మరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సూరారం రఘుపతి, చెన్నయ్య, కోశాధికారిగా తోకలిరాములు, ప్రచారాకార్యదర్శిగా కావాలికృష్ణయ్య, గౌరవ సలహాదారులుగా శంకరయ్య, నర్సిములును ఎన్నుకున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గండేడ్: మండలంలోని రుసుంపల్లిలో సోమవారం తెలుగు హన్మయ్యకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతిచెందింది. దీన్ని రెండు నెలల క్రితం కొన్నట్లు బాధితుడు తెలిపారు. దీని విలువ రూ.1.50లక్ష ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం ఓవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని గొల్లపల్లి శివారులో గల లలితాంబిక తపోవనం ప్రాంతంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ్‌ప్రసాద్ పాత్ర (42) తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పదో రోజు 3,684 ఇళ్లలో ‘సర్వే’



మహబూబ్‌నగర్‌లో సర్వేచేస్తున్న ఎన్యుమరేటర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో పదో రోజు సోమవారం 3,684ఇళ్ల వద్దకు ఎన్యుమరేటర్లు వెళ్లి సమగ్ర సర్వే చేశారు. మొత్తం 49వార్డుల పరిధిలోని 78,696ఇళ్లకు గాను ఇప్పటివరకు 41,049ఇళ్లకు చెందిన కుటుంబ యజమానుల నుంచి వివరాలు సేకరించారు.

పెరటి కోళ్లు పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న మహిళా సమాఖ్య నాయకులు, తదితరులు

మిడ్జిల్: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయుటకు ‘ఇందిరా మహిళ శక్తి’ ద్వారా మంజూరైన పెరటి కోళ్లను పంపిణీ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మహిళా సంఘాల అధ్యక్షులకు వీటిని అందజేశారు. కోళ్ల పెంపకం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహద పడుతాయని జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాందాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షాహీన్‌బేగం, సీసీ యాదమ్మ, మాజీ ఎంపీటీసీ గౌస్, నాయకులు జంగయ్య, పర్వతాలు, అంజి, రామ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

హన్వాడ: లగచెర్లలో గిరిజనులపై జరిగిన దాడికి నిరసనగా గిరిజన సంఘాల చలో లగచెర్లను అడ్డు కునేందుకు పోలీసులు గిరిజన సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. సోమవారం గిరిజన సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్‌ను మండలంలోని పూజారితండాలో హౌస్ అరెస్ట్ చేశారు. మండలంలోని పలు గిరిజన నాయకులను అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై వది లారు. లగచెర్ల ఘటనతో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా అరెస్టులు చేస్తున్నట్లు గిరిజన సంఘాల నాయకులకు పోలీసులు సూచించారు.

వినతిపత్రాలు అందించేందుకు..

నవాబుపేట: లగచర్ల ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందించే కార్యక్రమానికి వెళ్తున్న గిరిజన నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం గిరిజన నాయకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఈసందర్భంగా గిరిజన నాయకుడు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందర్ నాయక్ మాట్లాడుతూ పేద గిరిజనుల భూములు లాక్కోవటంతో పాటు వారిపై అక్రమంగా కేసులు వేయించి చిత్రహింసలు గురిచేయటం భావ్యం కాదన్నారు. గిరిజనులకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. పోలీసులు అరెస్టు చేసినవారిలో లింబ్యానాయక్, ప్రేమ్‌కుమార్‌నాయక్, హరి, నీల్యా, చందునాయక్, బాస్కర్, శంకర్, రమేష్, సేవ్యానాయక్, దేశ్యానాయక్ తదితరులు ఉన్నారు.



నవాబుపేట పోలీసుస్టేషన్‌లో గిరిజన నాయకులు



హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో గిరిజన సంఘాల నాయకులు

గిరిజనులను పరామర్శించేందుకు

మిడ్జిల్: లగచర్లలో జరిగిన దాడిలో గాయపడిన గిరిజనులను పరామర్శించేందుకు బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు సోమవారం వెళ్తుండడంతో, పోలీసులు ముందస్తుగా వారిని అరెస్ట్‌చేశారు. అరెస్టు అయినవారిలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మణ్‌పవార్, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.